సాక్షి కామారెడ్డి

ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024



కాంగ్రెస్‌ను గెలిపించాలి

జహీరాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను గెలిపించాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఓటర్లను కోరారు.

- 9లో ▸



రైతన్నలు అధైర్యపడొద్దు

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
42.8 /21.5

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

రేపు నిజామాబాద్‌కు సీఎం రేవంత్‌రెడ్డి రాక

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం నిజామాబాద్‌కు రానున్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్ కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు అనంతరం పాత కలెక్టరేట్ మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారని పేర్కొన్నారు. సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు.

6, 7 తేదీల్లో కేసీఆర్ పర్యటన

సాక్షి, కామారెడ్డి: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చేనెల 6, 7 తేదీల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన 6వ తేదీన నిజామాబాద్ పట్టణంలో రోడ్‌షోలో పాల్గొంటారు. రాత్రి పట్టణంలోనే బస చేస్తారు. మరుసటి రోజు సాయంత్రం 5.30 గంటలకు కామారెడ్డిలో నిర్వహించే రోడ్‌షోలో పాల్గొంటారు. అనంతరం మెదక్ జిల్లా కేంద్రానికి పయనమవుతారు.

జిల్లా జడ్జి శ్రీదేవి బదిలీ

సాక్షి, కామారెడ్డి: జిల్లా జడ్జి ఎస్ఎన్ శ్రీదేవి హైదరాబాద్‌లోని జుడీషియల్ అకాడమీకి బదిలీ అయ్యారు. ఆమె జిల్లా న్యాయమూర్తిగా రెండేళ్లపాటు పనిచేశారు. అనేక సామాజిక సమస్యలపై స్పందించారు. ఆమె స్థానంలో ఆదిలాబాద్ జిల్లా నుంచి వరప్రసాద్ బదిలీపై రానున్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి వాహనం తనిఖీ

నిజాంసాగర్: వెల్గనూర్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ కొనసాగుతోంది. శనివారం బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు.

'కర్షక్ బీఈడీ కళాశాలను అప్పగించండి'



కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాలకు అసలు యజమానిగా కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలను గుర్తించి, అప్పగించాలని కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ కోరారు. ఈ విషయమై శనివారం తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం.యాదగిరి, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ జి.చంద్రశేఖర్‌లను కలిసి వినతి పత్రం ఇచ్చారు. కామారెడ్డి కర్షక్ బీఈడీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో సీట్ల భర్తీ, అద్దె చెల్లింపు విషయమై మాట్లాడారు. కర్షక్ బీఈడీ కళాశాల మొత్తం ఆస్తులు కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందినవన్నారు. కళాశాల విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు కర్షక్ బీఈడీ కళాశాలను నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. విశ్వవిద్యాలయం అధికారులను కలిసిన వారిలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కే.కిష్టయ్య, సమన్వయకర్తలు ఎం.చంద్రకాంత్, వి.శంకరయ్య తదితరులు ఉన్నారు.

'56,936 టన్నుల ధాన్యం సేకరించాం'

కామారెడ్డి టౌన్: జిల్లాలో ఇప్పటివరకు 218 కొనుగోలు కేంద్రాల ద్వారా 56,936 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ శనివారం ఒక ప్రకటన తెలిపారు. రైతుల ఖాతాలలో రూ. 38 కోట్లు జమ చేశామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయని, తడిసిన పంటను కొనడం లేదన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. గత యాసంగి సీజన్‌లో ఏప్రిల్ 20 నాటికి 6,028 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరించామని, ఈసారి అదనంగా 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు చేశామని పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు.

నేడు ఓపెన్ యూనివర్సిటీ పరిచయ కార్యక్రమం

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ కళాశాలలో ఆదివారం బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని వర్సిటీ సమన్వయకర్త ఈ.రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ కార్యక్రమాలు, యూట్యూబ్, వెబ్ రేడియో, వివిధ మాధ్యమాల ద్వారా విద్యార్థులకు అందిస్తున్న సేవలను వివరిస్తామని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నాయినమ్మ యాదిలో..

- కోనాపూర్‌లో స్కూల్ భవనం నిర్మించిన మాజీ మంత్రి కేటీఆర్
- రూ.2.50 కోట్లతో మారిన బడి రూపురేఖలు

సండే స్పెషల్

సాక్షి, కామారెడ్డి: అమ్మమ్మ, నాయినమ్మల మీద ప్రతి ఒక్కరికి ప్రేమ ఉంటుంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన నాయినమ్మ, అమ్మమ్మల మీద ఉన్న ప్రేమతో వారి జ్ఞాపకార్థం ఏదైనా చేయాలని ఆలోచించారు. రూ. 5 కోట్లు వెచ్చించి నాయినమ్మ ఊరు బీబీపేట మండలంలోని కోనాపూర్‌తోపాటు అమ్మమ్మ ఊరు సిరిసిల్ల జిల్లాలోని కొదురుపాకలో ఆధునిక హంగులతో స్కూల్ భవనాలు నిర్మించారు.

బీబీపేట మండలంలోని కోనాపూర్ గ్రామం కేటీఆర్ నాయినమ్మ సొంతూరు. ఎగువ మానేరు నిర్మాణ సమయంలో కేటీఆర్ నాయినమ్మ కుటుంబం అక్కడి నుంచి చింతమడకకు వలస వెళ్లింది. ఆ ఊరితో కేటీఆర్‌కు ప్రత్యక్ష అనుబంధం ఏమీలేదు. కానీ తన కుటుంబ మూలాలు ఆ ఊళ్లో ఉన్నాయని ఆయన పలుమార్లు చెప్పారు. మూడేళ్ల క్రితం బీబీపేటలో వ్యాపారవేత్త తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.6 కోట్లతో ఆధునిక పాఠశాల భవనం నిర్మించారు. దాని ప్రారంభోత్సవంలో పాల్గొన్న కేటీఆర్.. తన నాయినమ్మ పేరుతోనూ ఓ బడి నిర్మిస్తానన్నారు. అన్నట్టుగానే రూ.2.50 కోట్ల సొంత డబ్బుతో 12 గదులతో రెండంతస్తుల భవనం నిర్మించారు. ప్రారంభోత్సవానికి సన్నద్ధమవుతున్న సమయంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో వాయిదాపడింది. అయితే ఎన్నికల కోసం పాఠశాల ప్రారంభోత్సవాన్ని ఆపవద్దని, సర్పంచ్ చేతుల మీదుగా ప్రారంభించాలని కేటీఆర్ సూచించడంతో నాలుగు నెలల క్రితమే ప్రారంభించారు. కోనాపూర్ పాఠశాల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సమయంలోనే కేటీఆర్ తన అమ్మమ్మ ఊరైన సిరిసిల్ల జిల్లాలోని కొదురుపాకలోనూ స్కూల్ భవనం నిర్మిస్తానని మాట ఇచ్చారు. అన్నట్టుగానే అక్కడా భవనం నిర్మిస్తున్నారు. ఇటీవల స్కూల్ భవన నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయని కేటీఆర్ 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ఆ పాఠశాల భవనం అందుబాటులోకి రానుంది.





కోనాపూర్‌లో కేటీఆర్ తన నాయినమ్మ వెంకటమ్మ పేరుతో నిర్మించిన పాఠశాల భవనం, భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కేటీఆర్ (ఫైల్)



డైనింగ్ హాల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు

ఆధునిక హంగులు..

కోనాపూర్‌లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఆధునిక హంగులతో నిర్మించారు. పాఠశాల ప్రాంగణమంతా పచ్చని గడ్డి పరిచారు. ఆట వస్తువులను అందుబాటులో ఉంచారు. కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. భోజనం చేయడానికి డైనింగ్ హాల్, వంటకు గది నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు ఫస్ట్ ఫ్లోర్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉన్నాయి. కార్పొరేట్ స్కూల్‌ను తలదన్నేలా పాఠశాల ఉంది.

నిర్వహణ లేక..

ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన పాఠశాల భవనం నిర్వహణ లేక అధ్వానంగా మారుతోంది. ఈ బడిలో ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. పాఠశాలలో అటెండర్‌గానీ, నైట్ వాచ్‌మన్‌గానీ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అంత డబ్బు వెచ్చించి ఆధునిక హంగులతో నిర్మించిన భవనాన్ని, సౌకర్యాలను కాపాడుకోవాల్సిన బాధ్యతను విద్యాశాఖ విస్మరించింది. కేటీఆర్ పాఠశాలలో నీటిశుద్ధి ప్లాంటు ఏర్పాటు చేయించారు. దానిని ఇన్‌స్టాల్ చేయించే విషయాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో వృథాగా ఉంది.

ఊరికి మేలు చేశారు



మంత్రి కేటీఆర్ తన నాయినమ్మ ఊరుకు ఎంతో చేశారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేశారు. పిల్లల కోసం పాఠశాల కట్టించినందుకు కృతజ్ఞతలు.

– గరిగె గంగయ్య, కోనాపూర్

అధికారులు దృష్టి సారించాలి



అత్యాధునిక హంగులతో పాఠశాల భవనాన్ని నిర్మించారు. అయితే నీటిశుద్ధి యంత్రం నిరుపయోగంగా ఉంది. ఫ్యాన్లు పనిచేయడం లేదు. అధికారులు దీనిపై దృష్టి సారించాలి.

– మొగిలి నర్సింలు, కోనాపూర్

గుర్తుండిపోయేలా..



సీఎం కేసీఆర్ మా గ్రామాన్ని గుర్తుపెట్టుకొని అభివృద్ధి చేశారు. బడితోపాటు గ్రామంలో రోడ్లు, మురికి కాల్వలు నిర్మించారు. వాటిని చూస్తుంటే కేసీఆర్ గుర్తుకు వస్తారు.

– గరిగె నర్సింలు, కోనాపూర్

మౌలిక సదుపాయాలు కల్పించాలి



కేటీఆర్ ఆధునిక హంగులతో పాఠశాల భవనం కట్టించారు. అయితే బడిలో ఫ్యాన్‌లు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ ఇబ్బంది తీర్చాలి. అలాగే వాచ్‌మన్‌ను ఏర్పాటు చేయాలి.

– సాయాగౌడ్, మాజీ సర్పంచ్, కోనాపూర్

'నాణ్యమైన విద్యుత్ అందించాలి'

లింగంపేట: రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ట్రాన్స్‌కో ఎస్ఈ రమేశ్‌బాబు సూచించారు. శనివారం లింగంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో లింగంపేట, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, గాంధారి, సర్వాపూర్, శెట్పల్లిసంగారెడ్డి సెక్షన్ల డివిజన్ స్థాయి ట్రాన్స్‌కో ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎల్‌సీ తీసుకునే సమయంలో జాగ్రత్తలను, ట్రాన్స్‌ఫార్మర్‌లు తరచూ కాలిపోకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. విద్యుత్ వైర్లు కిందికి వేలాడేలా ఉంటే వెంటనే సరిచేయాలని సూచించారు. రైతులు విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు సమాచారం ఇవ్వగానే వెంటనే స్పందించాలన్నారు. విధులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఈలు వెంకట్‌రంగయ్య, గణేష్, ఏడీలు సుదర్శన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ఏఈలు, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మన్‌లు, జూనియర్ లైన్‌మన్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఎస్ఈ రమేశ్‌బాబు

ఘనంగా బహుజన పరివర్తన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న దళిత సంఘాల ప్రతినిధులు

కామారెడ్డి టౌన్: జిల్లాకేంద్రంలో శనివారం రాత్రి దళిత సంఘాల ఆధ్వర్యంలో బహుజన పరివర్తన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్, జ్యోతీబా పూలే, బుద్ధుడి విగ్రహాలతో వీక్లీ మార్కెట్‌లో ప్రారంభమైన ర్యాలీ పుర వీధుల గుండా సాగింది. కార్యక్రమంలో దళిత సంఘాలు, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

- హామీలు అమలు చేయని కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి
- కారు గుర్తుకు ఓటేస్తే వృథానే..
- బీజేపీ సమావేశంలో మాజీ మంత్రి ఈటల రాజేందర్



ఎల్లారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు



మాట్లాడుతున్న ఈటల రాజేందర్, వేదికపై ఎంపీ బీబీ పాటిల్, కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్

ఎల్లారెడ్డి: బీజేపీతోనే ప్రజల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. శనివారం ఎల్లారెడ్డిలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్‌లో జహీరాబాద్ పార్లమెంట్ స్థాయి బీజేపీ, ఓబీసీ మోర్చా కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమ్మేళనం నేపథ్యంలో ముందుగా నాగిరెడ్డిపేటనుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ లింగంపేట మీదుగా ఎల్లారెడ్డి వరకు సాగింది. అనంతరం సమ్మేళనంలో ఈటల మాట్లాడుతూ రాష్ట్రంలో ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ గద్దెనెక్కిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటే హామీలను నెరవేర్చేందుకు ఇబ్బందులు ఉండవని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాలు గెలిస్తే రాహుల్‌గాంధీ పీఎం అవుతారా అని ప్రశ్నించారు. హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు.

బీఆర్ఎస్ గెలిచి ఏం సాధిస్తుంది?

మాజీ సీఎం కేసీఆర్ ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదని ఈటల రాజేందర్ ఆరోపించారు. కేంద్రం 2.53 లక్షల ఇళ్లను మంజూరు చేస్తే అందులో 1.25 లక్షల ఇళ్లను మాత్రమే నిర్మించారని, అందులోనూ 30 వేల ఇళ్లనే పంపిణీ చేశారని పేర్కొన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పంట రుణ మాఫీని అమలు చేయకపోవడంతో మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఇటు రాష్ట్రంలో అటు కేంద్రంలో అధికారంలో లేని బీఆర్ఎస్ ఎంపీ సీట్లను గెలిచి ఏం సాధిస్తుందో చెప్పాలన్నారు. కారు గుర్తుకు ఓటేస్తే వృథా అవుతుందన్నారు. కాంగ్రెస్ హయాంలో ఎన్నో స్కాంలు జరిగాయని, బీజేపీ పదేళ్ల పాలనలో ఒక్క అవినీతి జరగలేదని పేర్కొన్నారు. మోదీ పాలనలో దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతోందన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. దేశంలో బీజేపీ గెలిచే 400 సీట్లలో జహీరాబాద్ ఒకటని కామారెడ్డి ఎమ్మెల్యే, పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఎంపీగా పదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశానని బీబీ పాటిల్ పేర్కొన్నారు. సంగారెడ్డి– అకోలా రోడ్డు మార్గంతో పాటు పలు జాతీయ రహదారుల అభివృద్ధికి కృషి చేశానన్నారు. మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాం, నాయకులు బాణాల లక్ష్మారెడ్డి, పైడి ఎల్లారెడ్డి, పైల కృష్ణారెడ్డి, గంగారెడ్డి, బాపురెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు నామినేషన్లు నమోదు



సంగారెడ్డిలో నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్



నిజామాబాద్‌లో స్వతంత్ర అభ్యర్థి చరితారావు..

కామారెడ్డి క్రైం: జహీరాబాద్ నియోజకవర్గానికి సంబంధించి శనివారం మూడో రోజు నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి క్రాంతి వల్లూరుకు అందజేశారు. ఆయన నామినేషన్ ప్రక్రియలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, హన్మంత్ సింధే తదితరులు పాల్గొన్నారు. టీపీఎస్ అభ్యర్థిగా కొత్త బలిజ బస్వరాజ్, స్వతంత్ర అభ్యర్థులుగా ప్రవీణ్, రామారావు పాటిల్‌లు ఒక్కో సెట్ చొప్పున నామినేషన్లు వేశారు.

నిజామాబాద్‌లో ఏడు నామినేషన్లు..

సుభాష్‌నగర్: నిజామాబాద్ లోక్‌సభ స్థానానికి శనివారం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. శనివారం స్వతంత్ర అభ్యర్థులుగా ఆరే రాజేందర్, గంట చరితారావు, సయ్యద్ అస్గర్, మిర్యాల్‌కర్ జయప్రకాశ్ నామినేషన్లు వేయగా, ఇదివరకే నామినేషన్లు వేసిన స్వతంత్ర అభ్యర్థి రాగి అనిల్, విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థి భూక్యా నందు, బహుజన్ ముక్తి పార్టీ అభ్యర్థి దేవతి శ్రీనివాస్ రెండో సెట్ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందించారు. ఇప్పటివరకు మొత్తం 16 నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ తెలిపారు.

తప్పనిసరిగా ఓటు వేయాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: ఓటు వేయడం ప్రతి ఓటరు బాధ్యతని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. శనివారం స్వీప్ ఆధ్వర్యంలో కామారెడ్డిలోని సీనియర్ సిటిజన్స్ ఫోరం భవనంలో సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 85 ఏళ్లపైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్ద ఓటు వేసే సౌకర్యాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో 80 శాతం పోలింగ్ జరిగిందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. వేసవి కాలం కాబట్టి సీనియర్ సిటిజన్‌లు ఉదయం వేళలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. దివ్యాంగులకు రవాణా సదుపాయం కల్పిస్తామన్నారు. ఎలాంటి ప్రలోభాలు, ఒత్తిడులకు ప్రభావితం కాకుండా నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో ఓటేస్తామని, మన దేశ ప్రజాస్వామ్యం సంప్రదాయాలను కాపాడతామని సీనియర్ సిటిజన్లు, దివ్యాంగ ఓటర్లతో కలెక్టర్ పాటిల్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ రాజన్న, స్వీప్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ పీడీ బావయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

క్లుప్తంగా

స్ట్రాంగ్ రూంలకు భద్రత కల్పించాలి



మద్నూర్(జుక్కల్) : ఎన్నికల సామాగ్రి భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలకు గట్టి భద్రత ఏర్పాటు చేయాలని నియోజికవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పోలీసు, ఎన్నికల అధికారులకు ఆదేశించారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజికవర్గానికి జరగబోయే ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను శనివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌లు ఉన్న పాఠశాల చుట్టు సీసీ కెమెరాలు, 24 గంటల పాటు పోలీసు బందోబస్తు పెట్టినట్లు ఆయన తెలిపారు.

నష్ట పరిహారం చెక్కుల పంపిణీ

కామారెడ్డి క్రైం : లైంగిక వేధింపులకు గురైన ఇద్దరు బాలికలకు నష్ట పరిహారం కింద మంజూరైన రూ. 3 లక్షలు, రూ.2 లక్షల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్ చెక్కులను శనివారం జిల్లా జడ్జి ఎస్ఎన్ శ్రీదేవి పంపిణీ చేశారు. సుప్రీంకోర్ట్ ఆదేశాల ప్రకారం సెక్షన్ 357 ఏ ప్రకారం పోక్సో చట్టం కింద నమోదైన కేసుల్లో బాధితులుగా ఉన్న చిన్నారులకు పరిహారం అందుతుందన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారం బాధితులకి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో 1వ అడిషనల్ జిల్లా జడ్జి లాల్ సింగ్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జి టీ నాగరాణి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత



మాచారెడ్డి : మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలోని అంగడిలో పోగొట్టుకున్న రెండు సెల్ ఫోన్లను శనివారం మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్ బాధితులకు అందజేశారు. సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి సెల్ ఫోన్లను కనుగొన్నట్లు ఎస్సై వివరించారు.

గురుకుల ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



రాజంపేట : గురుకులాల ప్రవేశ పరీక్షలో మండల విద్యార్థులు సత్తా చాటారు. రాజంపేట మండలం శివాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 15 మంది, ఆరెపల్లి ప్రాథమిక పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు గురుకులాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ముదాం స్వామి, గంగమోహన్‌లతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఎస్ఎంసీ కమిటీ, పిల్లల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

అగ్నిమాపక వారోత్సవాలు ముగింపు

మద్నూర్(జుక్కల్) : వారం రోజులుగా కొనసాగిన అగ్నిమాపక శాఖ వారోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఫైర్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ నర్సింలు మాట్లాడుతూ మద్నూర్‌లో ఫైర్‌స్టేషన్ ప్రారంభం నుంచి ఈ ప్రాంతంలో అగ్ని ప్రమాదాల నుంచి అతి తక్కువ శాతం నష్టం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది వెంకన్న, రాజేందర్, వినోద్, రాణాప్రతాప్, సహదేవ్, దిగంబర్, సంతోష్ తదితరులున్నారు.

అడ్డగోలుగా వడ్డీ దందా

- జిల్లాలో విస్తరించిన వ్యాపారం
- వెయ్యి మందికిపైగానే వ్యాపారులు
- పోలీసుల దాడులపై సర్వత్రా చర్చ



మోర్తాడ్(బాల్కొండ): స్థిరాస్తులు, బంగారం తనఖా పెట్టుకుని వడ్డీ వ్యాపారం చేసేవారి సంఖ్య జిల్లాలో వెయ్యి మందికి పైగానే ఉన్నట్లు తెలుస్తోంది. వడ్డీ వ్యాపారం జిల్లాలో అడ్డగోలుగా సాగుతున్న తరుణంలో పోలీసుదాడులపై సర్వత్రాచర్చ నెలకొంది. గడిచిన సోమవారం జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌ల పరిధిలో వడ్డీ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలపై దాడులను నిర్వహించి 30 మందిపై కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి ఎక్కడ చూసినా వడ్డీ వ్యాపారుల తీరుపైనే చర్చ సాగుతోంది. వ్యవసాయ భూములు, ఇండ్లు, ప్లాట్లను తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేసుకుని అధిక వడ్డీకి ఎంత అంటే అంత సొమ్మును అప్పుగా ఇచ్చే వ్యాపారులు కోకొల్లలుగా ఉన్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సందేహాలకు తావిస్తోంది. అలాగే బంగారం నగలు తనఖా పెట్టుకుని ఎక్కువ వడ్డీకి అప్పు ఇచ్చే వ్యాపారులు ఎక్కడ అంటే అక్కడ ఉన్నా వారిని పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వడ్డీ వ్యాపారులను గుర్తించడంలో నిర్లక్ష్యం!

పోలీసు అధికార యంత్రాంగం ఆయా స్టేషన్ల పరిధిలోని వడ్డీ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలపై దాడులు నిర్వహించాలని ఒక జాబితాను రిలీజ్ చేసినట్లు తెలిసింది. అయితే, వడ్డీ వ్యాపారుల జాబితాను తయారు చేయడంలోనే నిర్లక్ష్యం జరిగిందనే వాదన బలంగా వినిపిస్తోంది. పోలీసులు పట్టుకున్నవారిలో చిన్న వ్యాపారులకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు డెయిలీ కలెక్షన్ విధానంలో అప్పు ఇచ్చే వడ్డీ వ్యాపారులే ఉన్నారు. వ్యవసాయ భూములకు ఎకరానికి రూ.15లక్షల నుంచి రూ.20లక్షల వరకు నూటికి రూ.3 చొప్పున వడ్డీకి ఇచ్చే బడా వ్యాపారులు పోలీసుల దాడుల నుంచి తప్పించుకోవడం విశేషం. పోలీసు శాఖకు చెందిన నిఘా విభాగం వడ్డీ వ్యాపారుల జాబితాను సరిగా రూపొందించకపోవడంతోనే చిన్నచిన్న ఫైనాన్స్‌లు నిర్వహించుకునేవారినే పోలీసులు పట్టుకున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తహసీల్ కార్యాలయాల్లో నిఘా ఉంచితే వ్యవసాయ భూములను తమ పేరిట బదలాయించుకుని వడ్డీకి అప్పు ఇచ్చే వ్యాపారుల గుట్టు బయటపడే అవకాశం ఉంది. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోనూ నిఘా పటిష్టం చేస్తే వ్యవసాయేతర భూములు, భవనాలను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుని వడ్డీ దందా చేసేవారి జాబితా బయటకు వచ్చే అవకాశం ఉంది. పోలీసులు సరైన ప్రణాళిక లేకుండా దాడులు చేశారని, బడా వ్యాపారులకు తప్పించుకునే అవకాశం ఇచ్చారని పలువురు పేర్కొంటున్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి



అవసరానికి అప్పు చేస్తున్నవారి నుంచి అధికంగా వడ్డీ వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. వడ్డీ వ్యాపా రులు రోజురోజుకూ తమ ఆస్తులను పెంచుకుంటూ పోతుంటే అప్పులు చేసిన వారు రోడ్డునపడుతున్నారు. ధర్మబద్ధంగా వడ్డీ వసూలు చేసేవారిని వదలిపెట్టి అక్రమార్జనే ధ్యేయంగా బతుకుతున్నవారిపై కఠినంగా వ్యవహరించాలి.

– వినీత్‌కుమార్‌గౌడ్, మోర్తాడ్

రైతన్నలు అధైర్యపడొద్దు





సోమారంపేటలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న షబ్బీర్ అలీ, బీబీపేటలో మాట్లాడుతూ..

మాచారెడ్డి : అకాల వర్షంతో పంటలు దెబ్బతిన్న రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎస్సీఎస్టీబీసీ మైనారిటీ శాఖల సలహాదారు షబ్బీర్ అలీ రైతులకు భరోసా ఇచ్చారు.శనివారం మండలంలోని సోమవారం పేటలో వడగళ్ల వానతో దెబ్బతిన్న వరి పంటలను ఆయన పరిశీలించారు. అలాగే కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన చెందారు.కొట్టుకు పోయిన ధాన్యం అంచనా వేసి నష్ట పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. పంట నష్టపోయిన రైతులు,కౌలు రైతులతో మాట్లాడారు. అక్కడి నుండే జిల్లా కలెక్టర్ తో మాట్లాడి పంట నష్టం అంచనా వేసి పరిహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 15రోజుల కిందటే సీఎం రేవంత్ రెడ్డి పంట నష్టంపై సర్వే నిర్వహించారని అన్నారు. ఎన్నికలు ముగిశాక ఆ నివేదికల ఆధారంగా పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారని షబ్బీర్ అలీ అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నౌసిలాల్ నాయకులు సదార్ నాయక్,గణేష్ నాయక్, బాల్ రాజ్ గౌడ్ ఉన్నారు.

హామీల అమలులో ముందుంటాం

బీబీపేట : గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ ప్రజల ముందుకు వచ్చేది కేవలం కాంగ్రెస్ పార్టీ తప్ప మరేది లేదని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఫంక్షన్ హాలులో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుతారి రమేష్ అధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సురేష్ షెట్కార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం బిల్లు పాస్ చేయించడంలో తాను కూడా పార్లమెంట్‌లో ఓటు వేశానని, అభివృద్ధి కోసం ప్రతి గ్రామంలో తిరిగానని అన్నారు. గత పదేళ్లలో గెలిచిన బీబీపాటిల్‌కు అభివృద్ధి అంటే ఏంటో కూడా తెలియదని పేర్కొన్నారు. బీబీపాటిల్ అంటే బిజినెస్ పాటిల్ అని ఎద్దేవా చేశారు. జనగామ గ్రామం నుండి ఇద్దరు సామాజిక సేవాపరులు వేణుగోపాల్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి ఒకటయ్యారని దీంతో పాత నీళ్లు కొత్త నీళ్లు ఒకటయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సుతారి రమేష్, డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ ఇంద్రసేనారెడ్డి, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, శ్రావణ్‌కుమార్, భూమాగౌడ్, శ్రీనివాస్, మాజీ సర్పంచులు రాజు తదితరులున్నారు.

ధ్వంసమైన పంటల పరిశీలన



వరిని పరిశీలిస్తున్న అధికారులు

మాచారెడ్డి : మండలంలోని ఎల్లంపేట, సోమారంపేట గ్రామాల్లో వడగళ్ల వానతో ధ్వంసమైన పంటలను శుక్రవారం కామారెడ్డి ఏడీఏ అపర్ణ, మాచారెడ్డి ఏవో రమ్యశ్రీలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. వడగళ్ల వానతో దెబ్బతిన్న పంటల వివరాల నివేదికలను పైఅధికారులకు నివేదిస్తామన్నారు. సోమారాంపేట, ఎల్లంపేట, అంకిరెడ్డిపల్లి, నడిమి తండాల్లో కలిపి మొత్తం 120 ఎకరాల్లో వరి పంట దెబ్బ తిన్నట్లు వివరించారు. ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. మాచారెడ్డి ఏవో రమ్యశ్రీ, ఏఈవోలు సౌజన్య,శివ చైతన్య రైతులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం అదే గ్రామానికి చెందిన మామిడాల సంతోష్ కుమార్, ప్రత్యూష దంపతులు రూ.25 వేలు, మామిడాల సందీప్ కుమార్, సౌమ్య దంపతులు రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మెన్ కమలాకర్ రెడ్డి దాతలకు స్వామి చిత్ర పటాలను అందజేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది సంతోష్,లక్ష్మణ్ ఉన్నారు.

రసవత్తరంగా కుస్తీపోటీలు



హన్మాజీపేట్‌లో కుస్తీపోటీలు

బాన్సువాడ రూరల్ : మండలంలోని హన్మాజీపేట్ గ్రామంలో శనివారం నిర్వహించిన కుస్తీపోటీలు ఆద్యాంతం రసవత్తరంగా సాగాయి. చిన్నపిల్లల కుస్తీ మొదలుకుని మహారాష్ట్ర కర్ణాటక ప్రాంతాల నుంచి వచ్చిన మల్లయోధులు తమ ప్రతిభను చాటి వెండికడియాలు, నగదు బహుమతులు అందుకున్నారు. కుస్తీపోటీలను తిలకించడానికి వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో హన్మాజీపేట్ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, గ్రామస్తులు బోనాల సుభాష్, సంజీవులు, వెంకాగౌడ్, షేక్. అక్బర్, సాయిబాబ, ప్రవీణ్‌గౌడ్, రవి, సాయిలు, సింగం సంతు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి రక్తదానం

కామారెడ్డి అర్బన్ : తాడ్వాయి మండలం సంగోజివాడి ప్రాథమిక పాఠశాల టీచర్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కామారెడ్డి డివిజన్ కార్యదర్శి ఎండీ జమీల్ అహ్మద్ 26వ సారి రక్తదానం చేశారు. శనివారం హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో కామారెడ్డికి చెందిన ఓ మహిళకు అత్యవసరంగా కాలు ఆపరేషన్ కోసం రక్తం అవసరం కావడంతో జమీల్ అహ్మద్ బి పాజిటివ్ రక్తం దానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు, రక్తదాతల సమూహం ప్రతినిధులు వెంకటరమణ, సంతోష్, జీవన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక స్థానాలు బీజేపీవే..



శబరిమాత ఆశ్రమంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి ఈటల రాజేందర్

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : రాష్ట్రంలో మేలో జరిగే ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాల్లో గెలుపొందుతుందని మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ఆయన శనివారం తాడ్వాయి మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేశారు. మోదీ చేసిన అభివృద్ధి పనులకు ఓటర్లు ఆకర్షితులవుతున్నారని, సర్వేలు కూడా బీజేపీకి అనుకూలంగా చెబుతున్నాయన్నారు. సీనియర్ నాయకులు పైడి ఎల్లారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్ రెడ్డి, నాయకులు తదితరులున్నారు.

క్రైం కార్నర్

బస్‌షెల్టర్‌లో ఒకరి మృతి



భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామ బస్‌షెల్టర్‌లో శనివారం తెల్లవారు జామున ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సాయి కుమార్ ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టి మృతుడు లింగంపేట మండలం ఎల్లారం గ్రామానికి చెందిన రుద్రబోయిన సాయిలు(44)గా గుర్తించారు. కామారెడ్డికి ఇల్లరికం వెళ్లిన సాయిలు భార్య స్వప్న, కుమారుడు వరుణ్‌తో కలిసి పట్టణంలోని షేర్‌గల్లీలో నివాసం ఉండేవాడని ఎస్సై తెలిపారు. స్వప్న నాలుగేళ్ల క్రితం మృతి చెందిందని, సాయిలు కామారెడ్డిలోనే ఉంటూ మేస్త్రి పని చేసుకుంటూ జీవించేవాడన్నారు. మేస్త్రి పనిచేసేందుకు పదిహేను రోజుల క్రితం ఇంటి నుంచి బయటికి వచ్చిన సాయిలు శనివారం బస్ షెల్టర్‌లో మృతి చెందాడన్నారు. మృతుడి తమ్ముడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. భార్య మృతి చెందిననాటి నుంచి సాయిలు మానసిక స్థితి బాగోలేదని, ఫిట్స్ రావడంతోపాటు తినకపోవడం, ఎండ దెబ్బ కారణంగా మృతి చెంది ఉంటాడని ప్రశాంత్ ఫిర్యాదులో పేర్కొన్నాడు.

రన్నింగ్ ట్రైన్ ఎక్కబోతూ మహిళ..



పంచనామా నిర్వహిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: చావుకు వచ్చి స్వస్థలానికి తిరిగి వెళ్తున్న ఓ మహిళ రన్నింగ్ ట్రైన్ ఎక్కుతుండగా కిందపడి మృతి చెందింది. ఈ ఘటన శనివారం ఉదయం 6గంటలకు నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కామారెడ్డి పట్టణానికి చెందిన పసుల రేవతి(39) నిజామాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన బంధువు అంత్యక్రియలకు హాజరైంది. శనివారం ఉదయం కామారెడ్డికి వెళ్లేందుకు నిజామాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చింది. రేవతి మూడో నంబర్ ప్లాట్‌ఫారంపైకి చేరుకునే సరికి ట్రైన్ కదిలింది. ట్రైన్ ఎక్కే క్రమంలో ఆమె కాలుజారి కిందపడిపోగా, కాలు, చేయి పూర్తిగా తెగిపోయాయి. రేవతి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం



బాలమల్లయ్య

భిక్కనూరు: మండలంలని జంగంపల్లికి చెందిన బాలమల్లయ్య(60) అదృశ్యమైనట్లు ఎస్సై సాయికుమార్ శనివారం తెలిపారు. మానసిక స్థితి సరిగాలేని బాలమల్లయ్య ఈనెల 15వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదన్నారు. భార్య మల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దేశీదారు పట్టివేత



బిచ్కుంద(జుక్కల్) : మహారాష్ట్రలోని దెగ్లూర్ నుంచి దేశీదారు తీసుకువస్తున్న వ్యక్తిని శనివారం డోంగ్లి వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సత్యానారాయణ తెలిపారు. అలాగే బెల్ట్‌షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తులను పట్టుకున్నామన్నారు. పిట్లం మండలం గుండితండా, డోంగ్లిలోని బెల్ట్‌షాపులపై దాడిచేసి మద్యం సీజ్ చేశామన్నారు. బాధ్యులపై కేసులు నమోదు చేశామన్నారు. మహారాష్ట్రకు చెందిన మద్యం రాష్ట్రంలోకి రాకుండా చెక్ పోస్టుల వద్ద విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి



బస్వాపూర్ గ్రామపంచాయతీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శ్రీనివాస్

భిక్కనూరు : ప్రతి జీపీ పరిధిలో వంద శాతం పన్నుల వసూలు చేయాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన భిక్కనూరు మండలం బస్వాపూర్ జీపీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. వేసవి కాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండ చర్యలు తీసుకోవాలన్నారు. ఇంచార్జీ ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి దయాకర్‌లు ఉన్నారు.

ఆధ్యాత్మికం

గంగాభవాని ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలం పోచారంలో నూతనంగా నిర్మించిన గంగాభవానీ ఆలయంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు శనివారం ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎల్లమ్మ ఆలయం వార్షికోత్సవాలు

భిక్కనూరు : మండలంలోని బస్వాపూర్ గ్రామంలోని రేణుకా దేవి ఎల్లమ్మ ఆలయం 35వ వార్షికోత్సవ ఉత్సవాలను ఈనెల 21నుంచి 24వ తేది వరకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గౌడ సంఘం అధ్యక్షుడు సత్యానారయణగౌడ్ శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 22వ తేదీ సోమవారం గ్రామ దేవతలకు బోనాలు, 23వ తేదీ రేణుకాదేవి-జమదగ్నిల కల్యాణం తదుపరి అమ్మవారికి బోనాల సమర్పణ, 24వ తేదీ బోనాలు గృహప్రవేశం కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో అన్నాదమ్ముళ్లకు తీవ్రగాయాలు

డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లితండా శివారులో 44వ నెంబరు జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్నాదమ్ముళ్లిద్దరికి తీవ్రగాయాలైనట్లు ఎస్సై యూ మహేశ్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నడిపల్లితండాకు చెందిన సోదరులు బట్టు సురేశ్, సతీశ్ బైక్‌పై ఆస్పత్రికి వెళ్లి తిరిగి వస్తుండగా.. ఆర్మూర్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం తండా శివారులో బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై నుంచి సురేశ్, సతీశ్ ఎగిరి పడడంతో తీవ్రగాయాలయ్యాయి. ఢీకొట్టిన వావానం కింద బైక్ ఇరుక్కుపోగా, డ్రైవర్ ఆ వాహనాన్ని ఆపకుండా తీసుకెళ్లాడు. సీఎంసీ వద్ద బైక్‌ను రోడ్డుపక్కన పడేసి వెళ్లిపోయారు. కొద్దిసేపటికి సురేశ్ తల్లి ఫోన్ చేయగా, ప్రమాదం జరిగిన సమయంలో అటుగా వెళ్తున్న వ్యక్తి లిఫ్ట్ చేసి ప్రమాదవిషయం తెలిపాడు. కుటుంబ సభ్యులతోపాటు తండావాసులు ఘటనాస్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. సతీశ్ పరిస్థితి విషమంగా ఉందని తండావాసులు తెలిపారు. తండ్రి మాంజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సురేశ్ తెలంగాణ యూనివర్సిటీలో జూనియర్ అసిస్టెంట్ (అవుట్ సోర్సింగ్)గా పని చేస్తున్నాడు.

లారీ బోల్తా



జక్రాన్‌పల్లి: నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు చెప్పుల లోడ్‌తో వెళ్తున్న లారీ మండల కేంద్రంలో శనివారం ఉదయం బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ సమీర్‌తోపాటు క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి డ్రైవర్, క్లీనర్‌కు జక్రాన్‌పల్లిలో ప్రథమ చికిత్స చేయించారు. డ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలిసింది.

పోక్సో కేసు నమోదు

బోధన్‌రూరల్: సాలూర మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తిపై పోక్సో చట్టం కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ శనివారం తెలిపారు. బాలిక ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి సదరు వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేశామన్నారు.

కల్లు దుకాణాలపై పోలీసుల దాడి

బాన్సువాడ రూరల్: మండలంలోని బుడిమి గ్రామంలోని కల్లుదుకాణాలపై బాన్సువాడ సీఐ మున్నూరు కృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం దాడి చేశారు. కల్తీకల్లుకు తయారీకి వినియోగిస్తున్న ముడిసరుకును స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన మోహన్, జీవన్, ప్రవీణ్‌గౌడ్, సత్యనారాయణకు చెందిన దుకాణాల నుంచి సుమారు రూ.54,900 విలువ చేసే 732లీటర్ల కల్లును సీజ్ చేశారు. పరీక్షల నిమిత్తం కల్లు శాంపిళ్లను ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. కల్లును కల్తీ చేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని సీఐ కృష్ణ హెచ్చరించారు.

గడ్డివాము దగ్ధం

రుద్రూర్: మండల కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి గడ్డి వాము దగ్ధమైంది. నెమ్లి జగన్‌కు చెందిన గడ్డి వాముకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకోగా, అటువైపు వెళ్తున్న హనుమాన్ మాలధారులు మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. బోధన్ నుంచి వచ్చిన ఫైర్ ఇంజిన్ మంటలను ఆర్పివేసింది. సుమారు రూ.50వేల నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు.

సంకల్పంతో విజయాలు సాధించొచ్చు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

నిజామాబాద్‌అర్బన్: సంకల్ప బలంతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. రిజిస్ట్రార్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో విజయం సులువుగా రాదని, నిరంతరం శ్రమించాల్సిందేనని అన్నారు. ఆలోచన బాగుంటే మంచి ఫలితాలు అందుతాయన్నారు. ప్రకృతితోపాటు మన చుట్టూ ఉన్న వారి నుంచి మంచిని నేర్చుకోవాలని సూచించారు. అంతర్గత ప్రతిభకు, సృజనాత్మక శక్తికి పెద్దపీట వేయాలన్నారు. సభాధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి రామ్మోహన్‌రెడ్డి కళాశాల నివేదికను వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ జానపద నృత్యాలు అలరించాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలతోపాటు పతకాలు, బహుమతులను అందజేశారు. వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ రఫీక్ అహ్మద్, డాక్టర్ వేణు, సాంస్కృతిక విభాగం సమన్వయకర్త డాక్టర్ అంబర్‌సింగ్, డాక్టర్ భరత్‌రాజ్, డాక్టర్ ఆదెప్ప, డాక్టర్ సత్యవరప్రసాద్, డాక్టర్ లక్ష్మీనారాయణ, పీడీ బాలమణి, డాక్టర్ ప్రభాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జానకంపేటలో చోరీ

ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేటకు చెందిన నీలం లింగన్న ఇంట్లో దుండగులు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, ఉక్కపోత కారణంగా ఇంటి తలుపులు తెరిచి లింగన్నతోపాటు కుటుంబ సభ్యులు నిద్రపోయారు. ఇదే అదునుగా భావించిన దండుగులు ఇంట్లోకి చొరబడి బీరువాలోని సుమారు నాలుగున్నర తులాల బంగారం, 20తులాల వెండి, రూ.25వేల నగదు ఎత్తుకెళ్లారు. ఇంట్లో చోరీ జరిగినట్లు శనివారం ఉదయం గమనించిన లింగన్న పోలీసులకు సమాచారం అందించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు.